

126 మెడల్స్, 387 అవార్డులు, 687 సర్టిఫికెట్లు.... ఏమిటీ లెక్కలన్నీ? విజయవాడకు చెందిన ప్రముఖ ఫోటోగ్రాఫర్ తమ్మా శ్రీనివాసరెడ్డి సాధించిన విజయాలివి. వాటిలో ఈ ఏడాది ఖాతాలోకి వచ్చిన ఏడు అవార్డులు అమెరికాలోని ఇమేజ్ కొలీగ్ సొసైటీ అనే ప్రతిష్టాత్మక సంస్థ నుంచి తీసుకున్నవి. 'ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం' (ఎమ్.ఏ. రహీమ్ మెమోరియల్ 2010కి) సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా ఉత్తమ ఫోటోగ్రాఫర్‌గా అవార్డును అందుకోబోతున్నారాయన. కెమెరా భుజాన వేసుకుని ముప్పయ్యేళ్లుగా తాను సాగిస్తున్న ప్రయాణం విశేషాలు ఆయన మాటల్లోనే...

'మొదటి ముగ్గురిలో ఒక తెలుగువాడు ఉండాలి'

''నేను పుట్టింది విజయవాడ సమీపంలోని ఉండవల్లి గ్రామంలో. మా ఊరని ఎక్కువ చేసి చెప్పడం కాదుగానీ, రెండు కొండల మధ్య దాక్కున్నట్టుగా ఉండే అందమైన పల్లెటూరది. ఒక కొండ ఎక్కుతూ ఉదయించే సూర్యుడు మరో కొండ వెనక్కి జారుతూ అస్తమిస్తాడు. ఆ మధ్యలో ఆకాశంలో రకరకాల రంగులను సృష్టిస్తాడు. ఈ చిత్రాన్ని కళ్లారా చూడాలంటే మీరు మా ఊరు రావాలి. మా ఊరికి సమీపంలోని ఉండవల్లి గుహలు చాలా ప్రాచీనమైనవి. గొప్ప శిల్ప సంపదకు ఆలవాలమైన బౌద్ధ గుహాలయాలుగా అవి చరిత్రకెక్కాయి. పరీక్షలొస్తున్నాయంటే చాలు, ప్రశాంతంగా ఉంటుందని మేం అక్కడికెళ్లి చదువుకునేవాళ్లం. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేసే శ్రీనివాస్‌గారు మా ఊరొచ్చి వాటిని ఫోటోలు తీసి పేపర్లో ప్రచురించే వరకూ వాటి అందం మాకు తెలియలేదు. ఈ సంఘటన నా జీవితాన్ని మలుపు తిప్పింది. అందమైన మా ఊరిని నేనూ అలా ఫోటోలు తియ్యాలన్న ఆలోచన నన్ను నిలవనివ్వలేదు. దాంతో ఇంటర్మీడియెట్ అయిపోయిన వెంటనే విజయవాడ వెళ్లి జర్నలిజం డిప్లొమాలో చేరి మరోవైపు శ్రీనివాస్ గారి దగ్గర శిష్యుడిగా ఫోటోగ్రఫీలో అక్షరాలు దిద్దడం మొదలుపెట్టాను నేను.

చదువబ్బతుందని నిరూపించా...

తొలిరోజుల్లో ఫోటోగ్రఫీ నేర్చుకోవాలంటే సొంత కెమెరా కావాలి. అప్పట్లో చాలా బేసిక్ మోడల్ యాషికా కెమెరా ధర 650 రూపాయలు. మా అమ్మానాన్నలు వ్యవసాయ కూలీలు. నేను ఈ కెమెరా కోరేటప్పటికి మా అమ్మకు రోజు కూలి రూపాయన్నర. అయినా సరే ఆమె నా కోరిక కాదనకుండా దాన్ని కొనిచ్చింది. ఆ కెమెరాతో ఒక పెళ్లి ఫోటోలు తీసి రెండున్నర వేల రూపాయలు సంపాదించాను. మా నాన్నకు నేనీ రంగంలోకి రావడం అస్సలు ఇష్టం లేదు. ఇది చదువు అబ్బనివాళ్లు చేసే పని అని ఆయన అభిప్రాయం. ఆయన నమ్మకం తప్పని నిరూపించడానికే నేను నాగపూర్ యూనివర్సిటీ నుంచి ఫోటోగ్రఫీలో పీహెచ్‌డీ పట్టా పుచ్చుకునేంత వరకూ ఆగకుండా శ్రమించాను. నాగపూర్‌లో చదువు నా ప్రపంచాన్ని విశాలం చేసింది. ఫోటో ప్రదర్శనలను విరివిగా చూడటం, పుస్తకాలు చదవడం, పెద్దవారితో చర్చలు – వీటన్నిటి వల్లా ఫోటోగ్రఫీలోని కళాత్మకత తెలిసొచ్చింది. క్షణకో చూసిన దృశ్యాన్ని, ఆ వెలుగునీడలు సహా అంతే అందంగా ఇతరులకూ చూపించాలంటే ఎంత కృషి చెయ్యాలో అర్థమయింది. ఓపీశర్మ, బేనూ సేన్, ఎస్సార్ పటేల్, కేజీ మహేశ్వరి, సిప్రాదాస్, రణ్‌బీర్ సింగ్ మొదలైన వాళ్లు నాకు గురుతుల్యులు. వాళ్లనుంచి నేనెన్నో విషయాలు నేర్చుకున్నాను.

ఉండవల్లి రత్నాలు

దేన్నయినా నవాలగా తీసుకునే తత్వం నాది. నా తోటివారు కొందరు అమెరికా వెళ్లడం, వారు ఊళ్లో ఉన్న తల్లిదండ్రులకు ఆర్థికంగా ఎంతోకొంత చేయూత కావడాన్ని గమనించాను. నేను ఊళ్లో ఉంటూనే అంతర్జాతీయ స్థాయి ఫోటోగ్రాఫర్‌గా పేరు తెచ్చుకోవాలి, నా కుటుంబాన్ని పేదరికం నుంచి బైటికి తీసుకురావాలి, ఊరికి మేలు చెయ్యాలని మూడు లక్ష్యాలను నాకు నేనే నిర్దేశించుకున్నాను. మా కుటుంబం కొంచెం నిలదొక్కుకోగానే ఉండవల్లి గ్రామ అభివృద్ధికి పదిహేను లక్షల రూపాయలు సాయం చేశాను. శ్మశానవాటిక, మంచినీటి సౌకర్యాలు కల్పించడంలో కూడా సాయపడ్డాను. ఇదిగాక పదో తరగతి నుంచి ప్రొఫెషనల్ డిగ్రీ వరకూ – ఏటా చదువులో రాణించే విద్యార్థులకు 'ఉండవల్లి రత్నాలు' అని అవార్డులివ్వడం ప్రారంభించాం. ఇది కొంచెం వినూత్నమైన కార్యక్రమం. సాధారణంగా అందరూ పిల్లలనే అభినందిస్తారు, సన్మానాలు చేస్తారు. మేం మాత్రం పిల్లలను కష్టపడి చదివించిన తల్లిదండ్రులకు సన్మానం చేస్తాం. కొన్నేళ్లుగా చేస్తున్న ఈ కార్యక్రమం ఎంత హిట్టయిందంటే ఇవ్వడు ఆ అవార్డు కోసం విద్యార్థులను ఎంపిక చెయ్యడమే కష్టమవుతోంది. అంతగా పోటీలు పడి చదువుతున్నారు మా ఊరి పిల్లలు.

అల్టిమేట్ 5డి

జర్మనీలోని స్వీడన్ నుంచి హాసెల్‌బ్లేడ్ హెచ్ 5డి కెమెరాను ఈమధ్యే తెప్పించాను. దీని ధర కోటి ముప్పైఎనిమిది లక్షలు. 'నీ వృత్తిలో రాణించడానికి ఆ కెమెరా ఉపయోగపడుతుందంటే పాలంలో కొంత భాగం అమ్మేసి అయినా కొనుక్కో' అని నన్ను ప్రోత్సహించింది మా అమ్మే. అలాగే చేశాను. ఇది 200 మెగాపిక్సెల్ సామర్థ్యమున్న కెమెరా. ఇప్పటికి ప్రపంచంలో ఇదే 'అల్టిమేట్' అన్నమాట.

చరిత్రను చాటిచెబుతాం

ఈమధ్యే బంజారాల ఫోటోలు తియ్యడానికి ఆదిలాబాద్ వెళ్లొచ్చాను. గడచిన పదిపదిహేనేళ్లలో వారి సంస్కృతి ఎంత మారిపోయిందంటే, ఇప్పుడు తమ సంప్రదాయమైన కట్టూబొట్టూతో బంజారాలెవ్వరూ కనిపించడం లేదు. అద్దాల దుస్తులు, వెండి కడియాలు, భుజాల వరకూ గాజులు, మువ్వల జుంకాలు... ఇవన్నీ క్రమంగా కనుమరుగైపోతున్నాయి. ఫోటోగ్రఫీ చరిత్రకు సాక్ష్యంగా నిలబడటం అంటే ఏమిటో అక్కడికెళ్లొచ్చాక బాగా అర్థమయింది నాకు. అందుకే ఫోటోగ్రాఫర్లు నడుస్తున్న చరిత్రను కెమెరాల్లో బంధించడానికి అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి.

మొట్టకోనివి రెండు

బ్రిటిష్ రాయల్ ఫోటోగ్రఫీ సొసైటీ పురస్కారాన్ని 2002లో అందుకున్నాక, నా కన్ను అమెరికాలోని ఇమేజ్ కొలీగ్ సొసైటీ మీద పడింది. అత్యుత్తమైన ప్రమాణాలు పాటించే సంస్థ అది. నాలుగు విభాగాల్లో టాపర్లుగా నిలిచినవారు ప్రపంచంలో ముగ్గురంటే ముగ్గురే ఉన్నారు ఇప్పటికి. నేను ఐదు విభాగాల్లో ఉన్నతంగా నిలవాలని ఆరేళ్ల క్రితం నిర్ణయించుకున్నాను. ఈ ఏడాది ఏడింటికి ఒకో విభాగంలోనూ ఐదవస్థాయి ఫోటోలు తీసి మొత్తం 140 ఫోటోలు వారికి పంపాను. కనీసం ఐదిటిలో నేను విజేతగా నిలబడతాననుకున్నా, కానీ పిక్టోరియల్ బ్లాక్ అండ్ వైట్ – కలర్, నేచర్, వైల్డ్‌లైఫ్, ట్రావెల్, జర్నలిజం, కలర్ – ఇలా ఏడింటిలోనూ ఈ ఏడాదికి (2013) ప్రథమ స్థానం నాకే దక్కింది. 'మిస్టర్ శ్రీనివాసరెడ్డి ఫ్రమ్ ఇండియా' అని లండన్, అమెరికా వేదికల మీద పిలిపించుకోవాలన్న నా కల నెరవేరింది. ఫోటోగ్రఫీకి సంబంధించి నేను ముట్టుకోని రంగాలు రెండే రెండు. ఫ్యాషన్, న్యూడ్. అవి మాత్రం తియ్యను. మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా నిర్వహించే పోటీల్లో వరసగా ఎనిమిదేళ్లు ప్రథమ స్థానంలో నిలిచాక, ఇక చాలని నేను పాల్గొనడమే ఆపేశాను.

అగ్రపీఠం దక్కాలి

నేను ప్రారంభించిన 'ఫోటో ఇండియా' అరవై మందికి ఉపాధినిస్తోంది. పదిహేను ఇరవై మంది యువ ఫోటోగ్రాఫర్లకు అంతర్జాతీయ అవార్డులు వచ్చేలా ప్రోత్సహిస్తున్నాను. విద్యార్థులకు శిక్షణ శిబిరాలు ఏర్పాటు చెయ్యడం, మంచి ఫోటోలు తీసేలా వారిలో చైతన్యాన్ని కలిగించడం నాకిష్టమైన పనులు. వెలుగునీడల సయ్యాటతో తీసే ఛాయాచిత్రాల్లో జీవం ఉట్టిపడాలి. బొమ్మ పండాలి, మనసు కదలాలి. ఇదీ నా సిద్ధాంతం. అత్యుత్తమ ఫోటో గ్రాఫర్‌గా రాణించేందుకు మన దగ్గర ఉన్నన్ని వనరులు వేరే ఏ దేశంలోనూ లేవంటే నమ్మండి. అరకు అందాలు, రాజమండ్రి దగ్గర పాపికొండలు, కొల్లేరు, గుంటూరు దగ్గర ఉప్పలపాడులో పక్షులు... పీటస్బర్గ్‌తోపాటు మంచి కాంతి... ఇవన్నీ మనకు ప్రకృతి ప్రసాదాలే కదా. ఇన్ని సహజ వనరులు ఉన్నందుకు ప్రపంచ ప్రఖ్యాత ఫోటోగ్రాఫర్ల జాబితాలో మొదటి ముగ్గురిలో ఒక తెలుగువాడి పేరుండాలి. అదీ నా కల.

● అరుణ పప్పు

కుటుంబాన్ని కలిపింది

నేనెప్పటికీ మర్చిపోలేని సంఘటన ఒకటి నా ఉద్యోగ జీవితంలో జరిగింది. 1998లో ఒకరోజు రైల్వే గ్రౌండ్స్ పక్కగా రంగురంగుల బెలూన్లు పట్టుకొని అమ్మడానికి వెళుతున్న ఓ పాప కనిపించింది. ఆ ఉదయపు లేత కిరణాల్లో ఆ పాప, ఆమె చేతిలోని బెలూన్లు నా కంటికి అద్భుతంగా తోచాయి. వెంటనే ఫోటోలు తీశాను. తర్వాత ఓ జాతీయ స్థాయి పోటీకి దాన్ని పంపించాను. దానికి తొలి బహుమతి వచ్చి అది ఇండోర్‌లోని 'డైనిక్ భాస్కర్' అన్న దినపత్రిక తొలి పేజీలో అచ్చయింది. దాన్ని చూసిన స్థానికుడొకరు నా గురించి ఆరా తీసి విజయవాడ వచ్చేశాడు. జరిగిందేమంటే మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో టీ కొట్టు నడుపుతూ జీవించే ఓ చిన్న కుటుంబం తిరుపతి యాత్రకు వచ్చింది. తిరిగి వెళుతున్నప్పుడు వారి అమ్మాయి ప్రమాదవశాత్తూ విజయవాడ రైల్వే స్టేషన్‌లో తప్పిపోయింది. నా ఫోటోలో బెలూన్లు పట్టుకుని వెళుతున్నది ఆ పాపే. నాకోసం వెతుక్కుంటూ ఇంత దూరం వచ్చింది ఆ పాప తండ్రి. ఎంత విచిత్రమో చూడండి. 'నాకు ఆ పాప ఆచూకీ తెలియదు, ఆ ఫోటో యథాలాపంగా తీశానంతే' అన్నా ఆయన పట్టువదల్లేదు. నాలుగు రోజులు ఇద్దరం కలిసి విజయవాడంతా తిరిగాం. పాప ఎక్కడా కనిపించలేదు. ఆయన నిరాశగా వెళ్లిపోయాడు. సమయం ఉన్నప్పుడల్లా ఫోటో పట్టుకుని పాప కోసం ఆరా తీసేవాడిని. ఎనిమిది నెలలు గడిచాయి. మళ్లీ ఆయనొచ్చాడు. షరామామూలుగా ఉదయాన్నే వెతకడానికి బయల్దేరాం. ఆశ్చర్యం... ఆ పాప మళ్లీ బెలూన్లు పట్టుకుని ఎదురొచ్చింది. పాప తండ్రి ఆనందం పట్టలేక ఎదురెళ్లబోయాడు. ఆయన్ని వారించి 'అనలు పాపకు మీరు గుర్తున్నారో లేదో చూద్దాం..' అని ఆమె వచ్చే దారిలో నిలబడ్డాం. ఆమె వస్తూనే వాళ్ల నాన్నను చూసి హత్తుకుపోయింది. ఆ సంఘటనను ఎవ్వడు తల్చుకున్నా – నా ఫోటో ఒక ఆడపిల్ల అనాథ కాకుండా కాపాడింది, ఒక కుటుంబంలో వెలుగు నింపిందని నాకు గొప్ప సంతోషం ఉంటుంది!